వైభవంగా రథోత్సవం



ఎల్లారెడ్డిపేట: స్థానిక శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి పెద్ద రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో భగవరాధన, సేవాకాలం, నివేదన, గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు. సాయంత్రం రథ, హోమ, బలి ప్రతిష్ఠ అనంతరం గ్రామ పురవీధుల్లో పెద్ద రథంపై స్వామివారిని ఊరేగించగా, మహిళలు మంగళ హారతులిచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఏకాంత సేవాతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, ఎలగందుల అనసూయ, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, వేద పండితులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర



రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి నాగవెల్లి వేడుకలు, జాతర ఘనంగా జరిగాయి. స్వామివారి పల్లకి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటి రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతి బీఆర్‌ఎస్ లక్ష్యం

- బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు



కండువా కప్పుతున్న నర్సింగరావు

సిరిసిల్ల: తెలంగాణలోని అన్ని వర్గాల అభ్యున్నతి బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు అన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో సోమవారం మిల్ స్టోర్స్ ప్రతినిధులు కేటీఆర్‌కు మద్దతుగా తీర్మానాన్ని అందించి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండేలా మంత్రి కేటీఆర్ అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. మళ్లీ కేటీఆర్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిరిసిల్ల మిల్ స్టోర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సిరిసిల్ల పాత బస్టాండు నెంబర్ వన్ ఆటో యూనియన్ ప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, 'సెస్' డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు అన్నల్‌దాస్ వేణు, కంచర్ల రవిగౌడ్, మిల్స్ స్టోర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గుట్ల ప్రకాశ్, ఆటో యూనియన్ నాయకులు వేముల గణేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

గంభీరావుపేట: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండలంలోని దేశాయిపేటలో పలువురు నాయకులు, మహిళలు సోమవారం పార్టీలో చేరారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉందన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, సర్పంచ్ చంద్రకళ, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్ పాల్గొన్నారు.



ముస్తాబాద్: శివాలయంలో అభిషేకం



బోయినపల్లి: కొత్తపేట ఆలయంలో..



బోయినపల్లి: తడగొండ సాయి ఆలయంలో



వేములవాడఅర్బన్ అగ్రహారంలో తులసి కల్యాణం



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ఆలయంలో పూజలు



వేములవాడఅర్బన్: సాయిబాబా ఆలయంలో



ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లో లక్ష దీపార్చన

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్, ముస్తాబాద్, నామాపూర్, కొండాపూర్, పోతుగల్ శివాలయాలలో స్వామివారికి అభిషేకాలు చేశారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో, వేములవాడ శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బోయినపల్లి శివాలయంతో పాటు, విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వరస్వామి, తడగొండ, ఎన్నంపల్లి సాయి ఆలయాల్లో తులసి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీ సత్యనారాయణ వత్రాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలను దీపాలతో అలంకరించారు. - సిరిసిల్ల/ముస్తాబాద్/వేములవాడఅర్బన్/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట/రుద్రంగి

స్వామివారి లడ్డుకు రూ.75 వేలు

- పోటాపోటీగా వేలంపాట



వేలంలో లడ్డును దక్కించుకున్న రవి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద రథాన్ని రాత్రి ఊరేగించారు. అనంతరం స్వామివారి లడ్డుకు వేలంపాట నిర్వహించగా పోటాపోటీగా పాల్గొన్నారు. మొదటి లడ్డును దేశపాండి రవి రూ.75,116 సొంతం చేసుకోగా, రెండో లడ్డును సందుపట్ల రవీందర్‌రెడ్డి రూ.21,116, మూడో లడ్డును గడ్డం ఆనంద్ రూ.20,116కు దక్కించుకున్నాడు. మొదటి కొబ్బరికాయకు వేలంపాట నిర్వహించగా మిరియాల శ్రీనివాస్ రూ.6,116 దక్కించుకున్నాడు. వేలంలో లడ్డు దక్కించుకున్న రవిని సర్పంచ్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

- సిరిసిల్ల స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్ భారీ ర్యాలీ



సిరిసిల్లలో నిర్వహించిన భారీ ర్యాలీ

సిరిసిల్ల: అందుబాటు లో ఉంటా.. మీ బిడ్డగా ఆశీర్వదించండి అంటూ సిరిసిల్ల స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్ కోరారు. సిరిసిల్లలో బ్యాట్ గుర్తుతో నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా మాట్లాడారు. దశాబ్దకాలంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నానని అన్నారు. సిరిసిల్ల కొత్త బస్టాండు నుంచి అంబేద్కర్ సర్కిల్, నేతన్న విగ్రహం మీదుగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాయకులు గుంటుక మహేశ్, వివిధ జిల్లాల పద్మశాలీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను ఇంటికి.. నన్ను అసెంబ్లీకి పంపించండి



రోడ్ షోలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి, హాజరైన ప్రజలు

- సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి

వీర్నపల్లి: ఈ ఎన్నికలతో కేటీఆర్‌ను ఇంటికి, తనను అసెంబ్లీకి పంపించాలని సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వీర్నపల్లి కేంద్రంలో నిర్వహించిన రోడ్ షో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్‌కార్డులు రాలేదన్నారు. కాంగ్రెస్‌కు పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఉద్యోగ నియామకాలు, నిరుద్యోగ భృతి, ఉపాధి అవకాశాలు అంటూ నిరుద్యోగులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను ఓట్లతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగిందన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మండల మహిళ అధ్యక్షురాలు జోగుల మంజుల, లక్ష్మారెడ్డి, లెంకల లక్ష్మణ్, తిరుపతి, రాజు, చంద్రమౌళి, రాములు, కాంతయ్య, మహిళ పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.

ముస్తాబాద్: బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్ రెడ్డి అన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి



రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాణి రుద్రమ

- సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ

గంభీరావుపేట: తనను ఆశీర్వదించి గెలిపిస్తే సిరిసిల్లలో ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. సిరిసిల్లలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గల్లీల్లో బెల్టుషాపులు పెట్టి యువకులను వ్యసనపరులుగా మారుస్తోందని, ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వస్తే పది లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, బెల్టు షాపులను తొలగిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో పాలకులకు పట్టింపులేదని, ధాన్యం అధిక తూకం వేస్తున్న కమీషన్ల కోసం పెదవి విప్పడం లేదని దుయ్యబట్టారు. కుటుంబ, అవినీతిపాలన పోవాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని అన్నారు. బీసీ ముఖ్యమంత్రి కావాలంటే బీజేపీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు దేవేందర్‌యాదవ్, పత్తి స్వామిరాజ్, లక్కిరెడ్డి రాజిరెడ్డి, వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఎన్నికల సామగ్రి



వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఎన్నికల సామాగ్రిని సిబ్బంది తరలించేందుకు మండలాల వారీగా సిద్ధం చేస్తున్నారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయం నుంచి సామగ్రిని నియోజకవర్గంలోని ఆయా మండలాల వారీగా సరఫరా చేయనున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

- చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యం



ప్రచారంలో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం



ఆలయంలో బాండ్‌పేపర్‌తో మేడిపల్లి

చొప్పదండి/గంగాధర/రామడుగు/బోయినపల్లి: ప్రజలు సంపూర్ణ మద్దతుతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కోరారు. చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలన్నారు. కాంగ్రెస్‌తోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. వెంట కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పురం రాజేశం, గుర్రం భూమారెడ్డి, కుందేళ్ళ బాలకిషన్, కళ్ళెం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీలు అమలు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలంలోని చర్లపల్లి ఆర్, చర్లపల్లి ఎస్, ర్యాలపల్లి గ్రామాలలో సోమవారం మేడిపల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండుసార్లు పోటీ చేసి ఓడినా పదేళ్లుగా మీతోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేశానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు విరక్తి పుట్టిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధికారంలోకి రాగానే ఆసరా పెన్షన్ పెంచుతామని, గ్యాస్ సిలిండర్ ఐదువందలకు తగ్గిస్తామని, రైతుబంధు రూ.15వేలకు పెంచుతామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని, పండించిన పంటకు క్వింటాల్‌కు రూ.ఐదువందల బోనస్ అందిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదులక్షలు అందించడంతో పాటు స్థలం లేనివారికి 250 గజాల స్థలం ఇస్తామన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికి అందేలా చూస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రామడుగు సింగిల్‌విండో డైరెక్టర్ మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన గజ్జెల ఆనంద రావు నాయకులతో కలిసి సోమవారం మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మేడిపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం

చొప్పదండి నియోజకవర్గ ప్రజల సేవకోసం ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మేడిపల్లి సత్యం కోరారు. బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాల పట్ల ప్రజలకు నమ్మకం పెరిగిందని, కాంగ్రెస్ విజయం ఖాయమని తెలిపారు.

త్రిలింగ సంగమేశ్వర సన్నిధిలో బాండ్ పేపర్

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాననే హామీతో ఉన్న బాండ్‌పేపర్‌కు విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వర స్వామి సన్నిధిలో సత్యం ప్రత్యేక పూజలు చేశారు. గెలిచాక ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, మండల అధ్యక్షుడు రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

'కవ్వంపల్లి' బ్రాండ్.. ఓటర్లకు బాండ్!

- ఓటర్లకు బాండ్ పేపర్ రిలీజ్
- సోషల్ మీడియాలో వైరల్



బాండ్ పేపర్ రిలీజ్ చేస్తున్న కవ్వంపల్లి



బంక్‌లో పెట్రోలు కొడుతున్న కవ్వంపల్లి

తిమ్మాపూర్/గన్నేరువరం/శంకరపట్నం: ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. టీపీసీసీతోపాటు జాతీయ నేతలు తెలంగాణపైనే ఫోకస్ పెట్టి ప్రచారం చేస్తున్నారు. ఆకట్టుకునే మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అభ్యర్థులు ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలు ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సైతం తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయిన కవ్వంపల్లి ఈసారి గెలుపుపై ధీమాతో ఉన్నారు.

ఓటర్లకు బాండ్ పేపర్..

అల్గునూర్‌లోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, గెలిచిన తర్వాత కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 'నీతి, నిజాయితీతో బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రగతి కోసం కృషి చేస్తా'అని పూజలు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మానకొండూర్ ఓటర్లకు రాసిన బాండ్‌పేపర్ కూడా రిలీజ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే అలుగునూర్ చౌరస్తాలోనే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అల్గునూర్‌ను కరీంనగర్ కార్పొరేషన్‌లో కలిపిన తర్వాత అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. రిజర్వేషన్ ద్వారా ఎమ్మెల్యే అయిన రసమయి బాలకిషన్ అల్గునూర్ చౌరస్తా లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు వెడల్పులో తొలగించారన్నారు. మళ్లీ పెట్టిస్తానని పట్టించుకోలేదన్నారు. డివిజన్‌లో 360 మంది డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అప్లై చేసుకుంటే 16 మందికి ఇండ్లు ఇచ్చారని, అందులో అనర్హులే ఎక్కువ ఉన్నారన్నారు. ప్రచారంలో కవ్వంపల్లి సతీమణి డా.అనురాధ, కూతురు డా.శ్రేయ, తదితరులున్నారు.

రుణమాఫీ అమల్లో ప్రభుత్వం విఫలం

రుణమాఫీ అమల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని కవ్వంపల్లి అన్నారు. గన్నేరువరం, యాస్వాడ గ్రామాల్లో ప్రచారం చేశారు. రూ.లక్ష రుణమాఫీ హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమన్నారు. సహకార సంఘ మాజీ చైర్మన్ కోటీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, సర్పంచు కరుణాకర్‌రెడ్డి, ఎస్సీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు చంద్రారెడ్డి, అనిల్, తిరుపతిరెడ్డి, కొమురయ్య, అజయ్ పాల్గొన్నారు.

కవ్వంపల్లికి మద్దతుగా ప్రచారం

కవ్వంపల్లి సత్యనారాయణకు మద్దతుగా సీపీఐ నాయకులు గన్నేరువరం, ఖాసీంపేట, పారువెల్ల, మాదాపూర్, హన్మాజిపల్లె గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని హమాలీ సంఘాల సభ్యులను, ప్రజలను కలిసి సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపించారు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపిద్దాం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ప్రభుత్వాన్ని గద్దెదించి ఇంటికి పంపాలని కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలంలో తిరుగుతూ ఆరు గ్యారంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. ఏడాదిలో లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, రైతులకు, మహిళలకు సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. డబు ల్ బెడ్‌రూం, దళితబంధు, రుణమాఫీ అందించని ఎమ్మెల్యేను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జంగిలి సపంపత్, ఇస్మాముద్దీన్, సదానందం, తిరుపతి, రహీం పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ గ్రామశివారులో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించి వదిలేశారు. సీఐ కిరణ్ కుమార్, ఎస్సై అశోక్, పాల్గొన్నాయి.

కోనరావుపేట: మండలం కొలనూరులో ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. ఆయన వెంట బీఎస్‌ఎఫ్ జవాన్లు ఉన్నారు.

మద్యం పట్టివేత

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక చెక్‌పోస్టు పరిసరాల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న అంజయ్య అనే వ్యక్తి వద్ద నుంచి రూ.9 వేల విలువైన 23 మద్యం ఆఫ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మామిడి మహేందర్ సోమవారం తెలిపారు. చెక్‌పోస్టు సిబ్బంది ఏఈఈ గోవిందు, ఐకేపీ ఏపీఎం చంద్రయ్య, పీసీలు సరేశ్‌నాయక్, సత్యనారాయణరెడ్డి, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ మండల మహిళా కన్వీనర్‌గా రాధ

ఎల్లారెడ్డిపేట: మండల కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలిగా గుండారంకు చెందిన గరిగే రాధను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి తెలిపారు.

చి'వరి'కి వానర బెడద



గంభీరావుపేట: ధాన్యాన్ని కొనుగోలుకు సిద్ధం చేసుకుంటున్న రైతులకు కోతుల బెడద తప్పడం లేదు. కోతులు గుంపులు గుంపులుగా ధాన్యం కుప్పలపై చేరి చిందరవందర చేస్తున్నాయి. వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తే రైతులపై కోతులు తిరగబడుతున్నాయి. కోతుల బెడద తప్పేదెప్పుడో అంటూ రైతులు వాపోతున్నారు.